సౌమ్యనాథుని సన్నిధిలో ఒరిస్సా హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-నందలూరు

ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక, ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా పేరుగాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామిని ఒరిస్సా రాష్ట్ర హైకోర్టు జడ్జి గౌరీ శంకర్ చత్రపతి కుటుంబ సమేతంగా గురువారం దర్శించు కున్నారు. ఆలయ అర్చకులు ఆయ నను పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి, ఆలయ చరిత్రను వివరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయనను పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక జడ్జి లత, పోలీసులు పాల్గొన్నారు.

ఒరిస్సా హైకోర్టు జడ్జిని సన్మానించిన అర్చకులు

'అసైన్డ్'పై పెద్దల కన్ను

అసైన్డ్ భూముల పంపిణీ వ్యవహారం అందనిద్రాక్షను తలపిస్తోంది. ప్రభుత్వం ఇటీవల అసైన్డ్ భూముల సాగుదారులకు హక్కులు కల్పిస్తామనే పేరుతో 9-22 ఆర్డినెన్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. జిల్లాలోని మండల రాజకీయ నాయకత్వం రాబంధుల అవతారం ఎత్తింది. అర్హులకు అసైన్డ్ భూములు పంపిణీ చేయాలనే ప్రభుత్వ ఆశయం దారి తప్పింది. ఆయా మండలాల రాజకీయ నాయకత్వాలు గ్రామాల్లోని పలుకుబడిన కలిగిన ధనికులకు, వారి సమీప బంధువులకు పాస్‌పుస్తకాల్లో ఎటువంటి భూములు లేవనే సాంకేతిక కారణాలను చూపించి, పెళ్లికాని యువకులు, పెళ్లయిన కుటుంబాల్లోని యువత పేర్లతో అసైన్డ్ భూములను కొట్టేయడం పరిపాటిగా మారింది. అసైన్డ్ కేటాయింపులకు సహకరించని తహశీల్దార్లపై దబాయింపులు, బెదిరింపులు, డిమోషన్లు, బదిలీలతో రాజకీయ నాయకత్వం గుప్పిట పట్టిన కారణంగా అర్హులకు అసైన్డ్ భూములను కేటాయించడం లేదనేది బహిరంగ రహస్యం.

- **రాజకీయం గుప్పిట్లో తహశీల్దార్లు**
- **డిమోషన్లు, బదిలీలతో ముప్పేట దాడి**
- **అసైన్డ్ వివరాల వెల్లడికి జిల్లా ఉన్నతాధికారులు ససేమిరా**

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో కడప, బద్వేల్, జమ్మలమడుగు, పులివెందుల రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. డివిజన్‌కు ఆరు వేల ఎకరాల చొప్పున సుమారు 25 వేల నుంచి 35 వేల ఎక రాల అసైన్డ్ భూములు ఉన్నట్లు అంచనా. సుమారు మూడు వేల ఎకరాలకు పైగా పంపిణీకి సిద్ధం చేసినట్లు సమా చారం. ఇటీవల పులి వెందుల మండలాల్లో అసైన్డ్ భూములను అనర్హులకు కేటాయించారనే వివరాలు బయటికి పొక్కడం రాజకీయ సెగలు పుట్టించింది. అనర్హులకు, ఉద్యోగుల పేర్లతో భూముల కేటాయింపులు చేయడం పెద్ద ఎత్తున చర్చనీ యాంశమైంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వివాదా స్పదంగా మారిన మండ లాల్లో రీసర్వేకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

తహశీల్దార్లకు తప్పని వేధింపులు

జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో 36 మండలాలు ఉన్నాయి. ఇందులోని అర్హులైన పేదలకు ఎనిమిదో విడత అసైన్డ్ భూసేకరణ, అర్హులు గుర్తింపు, భూముల కేటాయింపు వ్యవహారాలల్లో తహశీల్దార్లు క్రియాశీలక పాత్ర పోషించడం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగంపై రాజకీయ నాయకత్వం కన్నేసింది. ఆయా మండల అధికార యంత్రాంగాన్ని గుప్పిట పట్టింది. తాను చెప్పిన వారికి అసైన్డ్ భూములను కేటాయించాలని హుకుం జారీచేస్తోంది. చేసేదేమీ లేకపోవడంతో కొంత మంది తహశీల్దార్లు రాజీపడి రాజకీయ నాయకత్వం చెప్పినట్లు చేయడం అని వార్యంగా మారినట్లు తెలు స్తోంది.



అక్కడికి బదిలీ చేస్తే సెలవుపై వెళ్లాల్సిందే!

జిల్లాలోని బ్రహ్మం గారిమఠం, వీరపు నాయునిపల్లి తహ శీల్దార్లుగా వెళ్లడం సవాలుగా మారింది. రెవెన్యూ భూముల రికార్డులు సక్రమంగా లేకపోవడం, రాజకీయ నాయకత్వాలు ఒత్తిడి కారణంగా సెలవులపై వెళ్లాల్సి వస్తోందనే వాదన వినివి స్తోంది. ఇటీవలి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో తహశీల్దార్ల పనితీరుపై విమర్శలు వచ్చిన సందర్భంగా జాయింట్ కలెక్టర్ స్పందించి సదరు ప్రాంతాలకు ఎంతటి సీనియారిటీ కలిగిన అధికారులను పంపించినప్పటికీ విమర్శలే వస్తున్నాయనంటే అర్థమేమిటో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించడం పరిస్థితికి అద్దం పడుతోంది.

బెదిరింపు చర్యలతో హల్‌చల్

ఓ డిప్యూటీ తహశీల్దార్‌ను ఏడాది వ్యవధిలో ఆరుసార్లు బదిలీ చేయడం గమనార్హం. ఆర్నెళ్ల కిందట బ్రహ్మంగారిమఠం డిప్యూటీ తహశీల్దార్‌పై అధికార పార్టీకి చెందిన మండల నాయకత్వం భౌతిక దాడికి దిగే తరహాలో వీరవిహారం చేయడం తెలిసిందే. అనంతరం రాజకీయం చేసి డీమోట్, బెదిరింపులు, బదిలీలు వంటి సీన్లతో ఎపిసోడ్‌ను రక్తి కట్టించింది. వీరపునాయునిపల్లి, పెండ్లిమర్రి మండలాల్లోని కొండలు, ఒంటిమిట్ట మండల ప్రాంతంలోని అటవీ ప్రాంతంలోని సారవంతమైన వందలాది ఎకరాల పిఒటి భూములు, కాశినాయన, పోరుమామిళ్ల మండల ప్రాంతాల్లో అటవీ ప్రాంతాల్లోని కడప, కర్నూలు, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల్లో ఉంటున్న ధనవంతులు అసైన్డ్ భూములను కొట్టేయడం గమనార్హం.

అసైన్డ్ వివరాలు వెల్లడించలేం

అసైన్డ్ భూముల వివరాలు బయటికి వెళ్లడించలేం. ఇటీవల ప్రసార మాధ్యమాల్లో అనర్హులకు అసైన్డ్ భూములు కేటాయించారనే వార్తలు రావడంతో రీసర్వేకు ఆదేశించడమైంది.

- గంగాధర్‌గౌడ్, డిఆర్ఒ, కడప.

'ప్రజా రక్షణభేరి'ని జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి -రాయచోటి

లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అస మానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో నవంబర్ 15న నిర్వహించబోయే ప్రజా రక్షణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ప్రజారక్షణ భేరి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్క రించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బిజెపి తెలుగు రాష్ట్రాలకు అన్ని రకాలుగా తీవ్రమైన అన్యాయం చేస్తున్నప్పటికీ టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడంతో పాటు విశాఖ ఉక్కు, పోర్టులు, రోడ్లను ఆదాని పరం చేసినా, విభజన హామీలు అమలు చేయకపోయినా, నిత్యావసర సరుకుల ధరలతోపాటు, విద్యుత్ ఛార్జీల పెంచినా వామపక్ష పార్టీలు మాత్రమే బిజెపి విధానాన్ని ఖండించాయన్నారు. ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడినా, మన రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడుకోవాలన్నా సామాన్య ప్రజలకు నిజమైన ఊరట లభించాలన్నా ప్రజలే ఐక్యంగా కదలాలని పేర్కొన్నారు. ఎవరి కోసమో ఎదురు చూసే కన్నా మన బతుకులను, రాష్ట్ర భవిష్యత్తును సక్రమ మార్గాన నడిపించడానికి ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. ఈ ఉద్యమంలో సిపిఎంతో ప్రజానీకం భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్ళు పూర్తి కావస్తోం దన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు పరిశ్రమ లాంటి విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామికాభివద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి సిద్ధమైందని విమర్శిం చారు. అన్నదమ్ముల్లా సమైక్యంగా మెలగవలసిన ప్రజల మధ్య బిజెపి విద్వేషాలు రాజేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రాల హక్కుల్ని హరిస్తూ ఏకపక్షంగా నిర్ణయాలను రుద్దుతుందని తెలిపారు. దేశంలో నిరుద్యోగం రికార్డు స్థాయిలో పెరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్పొరేట్ సేవలో తరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రానికి ద్రోహం చేసి విభజన హామీలకు ఎసరు పెట్టినా కేంద్రాన్ని పల్లెత్తు మాట అనే ధైర్యం లేనప్పుడు 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నా ప్రజలకు, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని పేర్కొన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో, మోటార్లకు మీటర్లు పేరుతో, ఆస్తిపన్ను నుంచి చెత్తపన్ను వరకు అనేక భారాలు మోపుతున్నారన్నారు. ప్రభుత్వ విద్యా విధానంతో ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు నామమాత్రంగా తయారవడంతో కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీకి సామాన్యులు బలైపోతున్నారనరి పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం, అంగన్వాడీలకు, ఆశాలకు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు చేసిన వాగ్దానాలన్నీ గాలికెగిరిపోయాయని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, శాఖా కార్యదర్శి బి.రెడ్డెయ్య, నాయకులు జి.మాధవయ్య, కెవిపిఎస్ నాయకులు డి.సి.వెంకటయ్య, రైతుసంఘం జిల్లాప్రధాన కార్యదర్శి రామచంద్ర పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ఎఫ్‌ఎల్‌సిని పటిష్టంగా నిర్వహించాలి : గిరీష

గోడౌన్‌లో ఎఫ్‌ఎల్‌సి ప్రక్రియను తనిఖీ చేస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ఎఫ్ఎల్‌సి ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న గోడౌన్‌లో భద్రపరచిన ఇవిఎంలను, అక్కడ జరుగుతున్న ఎఫ్ఎల్‌సి ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. ఉదయం 9 గంటల నుంచి ఎఫ్ఎల్‌సి ప్రక్రియ ప్రారంభించామని డ్వామా పీడీ, ఇవిఎంల జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఎం.సి.మద్దిలేటి కలెక్టర్‌కు వివరించారు. ఎఫ్ఎల్‌సి ప్రక్రియకు హాజరవుతున్న సిబ్బంది, బెల్ ఇంజినీర్లు, పొలిటికల్ పార్టీల హాజరు పట్టికలు, నిర్దేశించిన అనెక్సర్లు 3, 5, 11, 12, 13, 14 లను, అక్కడి ఏర్పాట్లను కలెక్టరు పరిశీలించారు. అనంతరం ఇవిఎంల పనితీరు, వాటిని తనిఖీ చేస్తున్న వివరాలను అక్కడి బెల్ ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేసి పలు సూచనలు చేశారు. ఇవిఎం గోడౌన్‌ను పరిశీ లించారు. ఎఫ్ఎల్‌సి హాల్ వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబి రాన్ని తనిఖీ చేశారు. అవసరమైన మందులన్నీ సిద్ధంగా ఉంచు కోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లాలో ఎఫ్ఎల్సి ప్రక్రియ నిబంధనల మేరకు పక్కగా నిర్వహించాలని ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వరాదని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్ర మంలో డిఆర్ఒ సత్యనారాయణ, తహశీల్దార్ ప్రేమంత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ గంగప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బెల్ ఇంజినీర్లు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పంట నమోదు ప్రక్రియ

- జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్ర నాయక్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో 2023 ఖరీఫ్ సీజన్ పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్ర నాయక్ తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ సీజనులో 93,311 మంది రైతులకు చెందిన 2,04,739.9 ఎకరాలలో ఇ క్రాప్ పంట నమోదు పూర్తి చేశామన్నారు. 2,01,701 ఎకరాలకు గాను 92,273 మంది రైతుల ఇకెవైసి పూర్తయిందని చెప్పారు. జిల్లాలో రైతులు సాగుచేసిన పంట వివరాలు ఇ-క్రాప్‌లో నమోదు చేశామన్నారు. గ్రామ సభలో పంట నమోదు వివరాలు, పంట పేరు, సాగు విస్తీర్ణం, గ్రామ వ్యవసాయ సహాయకులు చదివి వినిపించాలన్నారు. ఈ నెల 29 వరకు రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం పంట నమోదు వివరాల జాబితా ప్రదర్శిస్తారని తెలిపారు. సామాజిక తనిఖీ, గ్రామ సభల ద్వారా ఏవైనా పంట నమోదు వివరాలు తప్పుగా నమోదు చేసినట్లయితే సరిదిద్దడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలోని రైతులందరూ పాల్గొని పంట వివరములు సరిచూసుకోవాలని కోరారు. ఇ-క్రాప్ పంట నమోదు వివరాలు రైతులకు సెల్‌ఫోన్ ద్వారా మెసేజ్ ద్వారా పంపుతారని తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రసీదు కూడా ఇస్తారన్నారు. జాబితాలో సవరణలు పూర్తయిన తర్వాత నవంబర్ ఒకటి నాటికి తుది జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తారని తెలిపారు వాటి ఆధారంగా పంట కొనుగోలు, బీమా, నష్టపరిహారం వంటి పథకాలు రైతులకు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. పంట నమోదుపై జరుగుతున్న సామాజిక తనిఖీ, గ్రామ సభలలో మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. **రామాపురం:** మండలంలోని ఖరీఫ్ సీజన్లో 6388 ఎకరాలకు గాను ఇ-క్రాపు పూర్తి చేసి ఈ నెల 28. 29. శని ఆదివారాల్లో ముసాయిదా జాబితా ప్రదర్శిస్తామని ఎఒ నాగమణి తెలిపారు. ఆర్‌బికెల్లో ఈ జాబితాను రైతులు చూసుకోవచ్చన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని భూములు కలిగిన రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను పూర్తి చేశామని ఎఒ కృష్ణ చైతన్య తెలిపారు. మండలంలో 3907.8 ఎకరాలలో ఇ-క్రాప్ పంట సాగు నమోదు చేశామన్నారు. **రైల్వేకోడూరు :** సబ్ డివిజన్ పరిధిలో 24,785 ఎకరాల్లో ఇ-క్రాప్ నమోదు పూర్తి చేశామని వ్యవసాయ సంచాలకులు కె.కవిత, ఎఒ జి.సుధాకర్ పేర్కొన్నారు. ఆర్‌బికెల్లో ఈనెల 29 వరకు ఇ-క్రాప్‌లో నమోదైన రైతుల జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామన్నారు. **లక్కిరెడ్డిపల్లి:** ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను ఆర్‌బికెల్లో రైతులు పరిశీలించుకోవాలని ఎఒ జయరాణి పేర్కొన్నారు. 30 వేల ఎకరాలలో పంట సాగు చేశారని తెలిపారు.

పోలీసు ఆయుధాల ప్రదర్శన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా అన్నమయ్య జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావు పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలు సాంకేతిక ఉపకరణాలు గురించి స్వయంగా ఆయనే విద్యార్థులకు వివరించారు. పోలీసు విధులు వారు వాడే ఆయుధాలు తదితర అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోవాలని ఉద్దేశంతో ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవ త్సరమూ ఈనెల 31 వరకు స్మారకోత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. 1959 సంవ త్సరం అక్టోబర్ 21న సిఆర్‌పిఎఫ్ జవాన్లు భారత్ చైనా సరిహద్దుల్లో ఉన్న లడక్ అక్షయ చిన్ వద్ద చైనా సైనికులను ప్రతిఘటిస్తూ చివరి రక్తం బొట్టు వరకు పోరాడి దేశం కోసం అశువులు బాసారని, అలాంటి పోలీసు అమరులను స్మరించుకోవ డంతో పాటు సమాజంలో పోలీసుల పాత్ర విధులు త్యాగాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు స్మారకోత్సవాలను నిర్వహి స్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో కార్యక్రమాన్ని నిర్వహించి పోలీసుల పనితీరు రికార్డుల నిర్వహణ గురించి విద్యార్థులకు వివరిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు చదువుకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పోలీసులు వాడే జిఎఫ్ రైఫిల్, 380 రివాల్వర్, ఎకె-47, 9 ఎంఎం గ్లాక్ పిస్టల్, 7.62 ఎంఎం ఎస్ యల్ ఆర్, ఫెడరల్ గ్యాస్ గన్, వియల్ పిస్టల్,303 రాయిట్ గన్, 9 ఎంఎం కార్బన్, ఇన్ శాస్ రైఫిల్, 12 బోర్ పంప్ యాక్షన్ గన్, మెటల్ డిటెక్టర్, డ్రాగన్ లైట్, బాంబు డిస్పోజల్ పరికరాలు, గ్రెనేడ్ హెచ్ఇ 36, కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్ సెట్స్, అవి పనిచేసే విధానం గురించి ఆయనే విద్యార్థులకు, ప్రజలకు స్వయంగా వివరించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి డాక్టర్ వి.బి. రాజ్‌కమల్, ఎఆర్ డిఎస్‌పి పి.మహబూబ్‌బాష, ఆర్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు ఆయుధాల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

క్రికెట్ స్టేడియం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ముమ్మరంగా క్రికెట్ స్టేడియం పనులు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

మండలంలోని దిగువ అబ్బవరం పంచాయతీ నక్కలవాండ్లపల్లి వద్ద 32.62 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులను గురువారం అధికారులతో కలిసి కలెక్టర్ గిరీష పి.ఎస్ పరిశీలించారు. స్టేడియం ల్యాండ్ స్కేపింగ్ పనులు, స్టేడియం సరిహద్దుల చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం ఏర్పాటు, స్టేడియం ప్రధాన పెవిలియన్ భవన నిర్మాణ ప్రగతి, స్టేడియం నుంచి ప్రధాన రోడ్డు నిర్మాణం అంశాలపై ఆ ప్రాంతం మొత్తం విస్తృతంగా కలియ తిరిగి పరిశీలించారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ, ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. నవంబర్ 15లోగా నాణ్యతగా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. మంచి సాయిల్ తీసుకొని వచ్చి గ్రౌండ్‌లో 2 ఇంచ్‌ల మేర వేసి పచ్చదనం కోసం గడ్డి విత్తనాలను చల్లాలని సూచించారు. గ్రౌండ్ మొత్తం గడ్డిని పచ్చదనంతో నింపాలని చెప్పారు. స్టేడియం చుట్టూ, రోడ్డు కిరువైపులా నాటిన మొక్కలకు రోజూ నీటిని అందించే కార్యక్రమాన్ని నిరంతరం చేపట్టాలని సూచించారు. పెవిలియన్ ముందుభాగం నుంచి ప్రధాన రోడ్డుకు అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలని రేపటి నుంచి ఆ పనులను కూడా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. పెవిలియన్ నిర్మాణ భాగం ఎడమవైపున ఆక్రమణలు తొలగించి స్థలం చుట్టూ రక్షణకు ఫెన్సింగ్ వెంటనే ఏర్పాటు చేయాలని చెప్పారు. పెవిలియన్ నిర్మాణంలో సిమెంట్ ప్లాస్టరింగ్, గోడలకు వాల్ పట్టి కోటింగ్, టైల్స్ ఏర్పాటు, కోచ్, ప్లేయర్స్ రూములు, వాష్, టాలెట్ల నిర్మాణం, క్రీడ పరికరాలు ఉంచడానికి స్టోర్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. క్రీడా మైదానంలో వాకింగ్ ట్రాక్, వాలీబాల్, టెన్నిస్, బాస్కెట్ బాల్ ఓపెన్ కోర్టులు కూడా ఏర్పాటు చేయాలనీ చెప్పారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి జిల్లా అధికారి సహదేవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగప్రసాద్, తహశీల్దార్ హేమంతకుమార్, రెవెన్యూ, ఆర్అండ్‌బి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్యశాలలో రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-వీరబల్లి

గ్రామీణ పశు వైద్యశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్రావు గురువారం ఆకస్మిక తనికీ చేశారు. మండలంలోని మట్లి పంచాయతీలోని గ్రామీణ పశు వైద్యశాలను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పశుసంవర్ధక శాఖలో రైతులకు సబ్సిడీతో ఆరు గడ్డి కత్తిరించే విత్తనాల మిషన్లు, 16,400 కిలోలు టిఎంఆర్ దాణా పంపిణీ చేసిన రికార్డులను, 1200 కిలోల గడ్డి విత్తనాలను సరఫరా చేసిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లైవ్ స్టాక్ అసిస్టెంట్ డాక్టర్ జయప్రకాష్ పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.గుణశేఖర్ పిళ్లై, డివిజనల్ అధికారి డాక్టర్ మాలకొండయ్య, టి.సుండుపల్లి అసిస్టెంట్ డైరెక్టర్ కె.విజయ్ కుమార్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్యశాలను పరిశీలిస్తున్న వెంకట్రావు

'అన్నమయ్య' బాధితులను ఆదుకోవాలి : 'మలిశెట్టి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య ప్రాజెక్టు వరద బాధితులను ఆదుకోవాలని జనసేన పార్టీ రాజంపేట ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ అన్నారు. గురువారం అమ్నమయ్య వరద బాధితుల అవస్థలపై స్థానిక ఫ్లైఓవర్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు జనసేన, టిడిపి నాయకులు సంయుక్తంగా ర్యాలీగా బయలుదేరి వెళ్లి ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలలో నేటికీ ఇసుకమేటలు తొలగించలేదని, వారికి మూడు నెలలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించకుండా వారిని నట్టేట ముంచేసారని ఆరోపించారు. రెండేళ్లు కావస్తున్నా నేటికి కనీస సౌకర్యాలు కల్పించకుండా వరద బాధితులను అనాధలుగా వదిలేసారని ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, జనసేన పార్టీ రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య. కడప జిల్లా లీగల్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రాజు, ఉపాధ్యక్షుడు కత్తి సుబ్బరాయుడు, జనసేన నాయకులు భాస్కర పంతులు, వెంకటేశ్వరరావు, రామా శ్రీనివాసులు, కోటయ్య నాయుడు, సతీష్ రాజు, గోపి, గోపాల్, చౌడయ్య, జనసేన వీర మహిళలు జడ్డ శిరీష, మాధవి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించాలి

ప్రజాశక్తి-పీలేరు

ఓటరు తన ఓటు హక్కును సజావుగా సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా తప్పులు లేని ఓటర్ల జాబితా అందించడం మన కర్తవ్యంగా భావించాలని పీలేరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి గోపాలకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహశీల్దార్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం తప్పులు లేని ఓటర్ల జాబితాను అందించడం కోసం సమిష్టి కృషి చేద్దామని చెప్పారు. ఈ నెల 27న వెలువడే ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పొప్పులు ఉన్నా, మార్పులు చేర్పులు ఉన్నా డిసెంబర్ 9లోగా అందుకు సంబంధించిన క్లైమ్లను బిఎల్‌ఒల ద్వారా సేకరించి ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులుంటే వాటిని సరిదిద్దాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల నాయకులు పారదర్శకంగా ఎన్నికల అధికారులకు సహకరించాలని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాను అందరూ పరిశీలించి మార్పు చేర్పుల ప్రక్రియలు త్వరగా పూర్తి చేసుకుంటే తప్పులు లేని కొత్త ఓటర్ల జాబితాను ముద్రించుకోవడానికి వీలవుతుందన్నారు. సమావేశంలో పీలేరు, కలికిరి, కెవి.పల్లి, కలకడ, వాల్మీకిపురం, మండలాల తహశీల్దార్లు ధనుంజయులు, భాగ్యలత, నరసింహులు, ప్రదీప్, ఫిరోజ్ ఖాన్, టిడిపి, సిపిఎం, బిఎస్‌పి పార్టీల ప్రతినిధులు పోలిశెట్టి సురేంద్ర, వెంకటాద్రి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని సిఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వి.గణేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబిఎ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో కెల్లా భారత దేశంలో యువత అధికమని, క్రమశిక్షణ అంకిత భావంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. మేనేజ్మెంట్ రంగంలో అత్యధిక వేతనంతో కూడిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు వంద శాతం ఉద్యోగ అవకాశాల కోసం అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని అకడమిక్ అంశాలతో పాటు సెమినార్, వెబినార్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కృషి, పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని, మొదటి సంవత్సరం నుండే ప్రత్యేక ప్రణాళికతో అడుగులు వేయాలని సూచించారు. వ్యవస్థను పటిష్ఠపరిచి ఉత్పాదన పెంచడంలో మేనేజ్మెంట్ రంగం కీలకమైందన్నారు. ఉత్పాదక రంగంలో భారతదేశం ప్రపంచ దేశాలకు పెట్టుబడుల స్వర్గధామంగా ఉందని, ఈ రంగంలో దేశంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఎక్కువ అని వివరించారు. ఇ-కామర్స్, అకౌంటెన్సీ, బిజినెస్, బ్యాంకింగ్, మార్కెటింగ్ వంటి పలు విభాగాలలో మేనేజ్మెంట్ పాత్ర కీలకమని వివరించారు. మేనేజ్మెంట్ విభాగం అధిపతి ఇంతియాజ్ మాట్లాడుతూ కళాశాలగా డిజిటల్ లైబ్రరీ, బోధన ,పరిశోధనలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని, అర్హత సాధించిన విద్యార్థులందరికీ కళాశాలలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్, రీజనింగ్ అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

బిసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కలికిరి

బిసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని బిసిఎప్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్‌యాదవ్ బిసి ఉద్యోగ సంఘ సభ్యులకు పిలుపునిచ్చారు. బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కలికిరిలో తిరుపతి మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 5న తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి బిసి ఉద్యోగుల మహాసభకు బిసి ఉద్యోగులు అందరూ హాజరుకావాలన్నారు. బీసీ ఉద్యోగుల సమస్యలు, రిజర్వేషన్ సక్రమ అమలు, కుల జనగణన చేపట్టి బిసి జనాభా తేల్చడం, జనాభా దామాషాగా అన్ని రంగాల్లోనూ, వ్యవస్థల్లోనూ ప్రాతినిధ్యం కల్పించడం, ఒబిసి సర్టిఫికెట్ జారీలో సమస్యలు, క్రిమీలేయర్ రద్దు, ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పన వంటి విషయాలను మహాసభలో చర్చిస్తారని చెప్పారు. బిసి కమిషన్‌కు చట్టబద్ధ అధికారాల కల్పన, రిజర్వేషన్ల అమలులో పారదర్శకత, వంటి అంశాలపై చర్చించి తగు తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించి సాధించుకునే దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ బిసి ఉద్యోగి ఈ మహాసభకు హాజరై సహకరించాలని పిలుపునిచ్చారు.

'సైబర్ స్మార్ట్ సర్టిఫికేషన్'పై అవగాహన

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ స్మార్ట్ సర్టిఫికేషన్ పై అవగాహన సదస్సును కళాశాల ఐక్యూఎసి, కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో లాంచ్ పేడ్ ఎల్‌ఎల్‌సి సహకారంతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.నాగరాజనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, కళాశాల అధ్యాపకులకు సైబర్ సెక్యూరిటీ పై అవగాహన కల్పించి సర్టిఫికెట్ పొందటంలో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ జి.దయానందం, ఇంగ్లీష్ అధ్యాపకులు డాక్టర్.జి.రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సామాజిక సాధికార యాత్ర ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సాధికార యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ యాత్ర నవంబర్ 9వ తేదీ తంబళ్లపల్లి నియోజకవర్గానికి చేరుకోనుంది. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో నియోజకవర్గంలో జరుగబోవు సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేయడానికి చేయవలసిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పొగాంద ఖలీల్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, పట్టణఅధ్యక్షుడు సి.ఆర్ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గాలివీడు

ఎపి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జిల్లా సుదర్శన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆవులశెట్టివారిపల్లె వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వద్ద కేక్ కట్ చేసి అభిమానులు తెలుపుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి2 గాలి శ్రీనివాసులు, ఎంపిటిసి చంద్రారెడ్డి, గోపనపల్లి సర్పంచ్ కేశవరెడ్డి, పులికుంట హరినాథ్ రెడ్డి, ఎంపిడిఒ శేఖరనాయక్, మండల కన్వీనర్ వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకట్రా, వైసిపి మైనార్టీ నాయకులు ఎస్‌కె ఖాదర్ మోహిన్, నిజాముద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఆప్ రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలని స్పెషల్ ఆఫీసర్ జిల్లా అధికారి స్పందన కోరారు. గురువారం ఆయన పరసతోపు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష రిజిస్ట్రేషన్ అంశంపై ఆరా తీశారు. ఈ యాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల ప్రతి లబ్ధిదారునికి ఆరోగ్య సంబంధిత పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఆప్ రిజిస్ట్రేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేంద్రనాథ్ పంచాయతీ కార్యదర్శి సోమశేఖర్ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న కళాబృందం

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-నందలూరు

ఖాతాదారులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని నందలూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అరుణ్ అన్నారు. గురువారం నందలూరు మండలంలోని పాటూరు, చెన్నయగారిపల్లె, కుంపినీపురం గ్రామాలలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజా బృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు ప్రధానమంత్రి ముద్రా యోజన, రుణాలు, వంటి వాటితో ఆర్థికంగా వృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ అరుణ్, ఫీల్డ్ ఆఫీసర్ పునీత్ కృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ లు శ్రీవాణి, జాఫ్నవిదర్, ఆఫీస్ అటెండర్ శ్రీరామ్ పాటూరు పాల్గొన్నారు.

దళితులు అధికార పదవులకు అర్హులు కారా?

ప్రజాశక్తి-పీలేరు

దేశ రాజకీయాల్లో అధికార పదవులకు దళితులు అర్హులు కారా అని మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ తెలిపారు. గురువారం పట్టణంలోని మాలమహానాడు ఐక్యవేదిక కార్యాలయంలో జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నాటి నుంచి నేటి వరకూ బహుజనులు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వీరిలో ఎలాంటి బలమైన మార్పులు రాలేదు, రానివ్వలేదని అన్నారు. కేవలం కొన్ని సామాజిక వర్గాలే పరిమితమైన అధికార పదవుల వేరేకొని అందనివ్వలేదని ఆరోపించారు. ఏ రిగా ప్రభుత్వ ప్రతినిధులు పోగొట్టుకోవడం తప్ప సాధించింది ఏమి లేదని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం నాయకత్వం, రాజ్యాధికార పదవులను సాధిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ రీజనల్ కన్వీనర్ చీకటిపల్లి రామాంజులు, చిత్తూరు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గుంతటి మురళి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పాటూరు దామోదరం, మహిళా అధ్యక్షులు రెడ్డెమ్మ, పీలేరు మండల నాయకులు పాటూరు నాగరాజ, నారాయణ, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

షేక్. అల్లాబక్ష్, తండ్రి ఎస్.ఫక్రుద్దీన్, వయసు 53 సం, ఆధార్ నెం.838887515006, అయిన నేను డోర్ నెం.6-237-H-1, బెంగుళూర్ బస్టాండ్ వద్ద, మదనపల్లి టౌన్ అండ్ మండలం, అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్. నందు నివసిస్తూ ఉన్నాను. నా యొక్క పాస్ పోర్ట్ నెం.Q 368 458 మదనపల్లి APSRTC బస్టాండ్ వద్ద20-10-2023 పోయినది. కావున ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్సు నందు ఇవ్వ వలసిందిగా కోరుతున్నాను.

ఇట్లు

షేక్. అల్లా బక్ష్, మదనపల్లి.

ప్రజా సంక్షేమమే ధ్యేయం :'చింతల'

ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కలకడ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ సచివాలయం పరిధిలో ఉన్న పెండ్లిమర్రివాండ్లపల్లె, నల్లగుట్టపల్లె, అచ్చర్లవారిపల్లి, తోటిపల్లి, జరిగడ్డ, దిగువ పాలెం, అరిపెంటదీన్నె, తూర్పు వడ్డిపల్లి, ఇర్రివాండ్లపల్లి, నాయనవారిపల్లి, ఆరమడకలవారిపల్లి, ఆరమడకలవారిపల్లి దళితవాడ గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల వైసిపి పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైసిపికే దక్కు తుందన్నారు. కార్మికులు, రైతులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు సంతృప్తికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. సంక్షేమ పాలన కోసం వచ్చే ఎన్నికల్లో తిరిగి జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి చేయాలని అభ్యర్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కమలాకర్ రెడ్డి, నాయకులు కుమార్ నాయుడు, రవికుమార్, కుమార్‌రెడ్డి, సింగల్ అండ్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, వైసిపి నాయకులు , కార్యకర్తలు, తహశీల్దార్ ప్రదీప్, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, సీఐ నాగేంద్ర, ఎస్ఐ తిప్పేస్వామి, ఎపిఒ చెన్నకేశవులు, ఎపిఎం రమేష్, పంచాయతీ కార్యదర్శులు ,విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

- పట్టని అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గొరాన్ చెరువు పంచాయతీ గేటు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న మురికి కాలువనీరు రోడ్లపై చేరి దుర్గంధం వెదజల్లుతోంది. కుమ్మరపల్లి పెద్దచెరువు వంకలోకి మురికాలువ నీళ్లు పోవడానికి ఏర్పాటు చేశారు. మురుగు కాలువలో అడ్డంకులు ఉండటంతో నీరు రోడ్డుపై పొంగి ప్రవహిస్తోంది. రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగుతో దోమలు విజృంభిస్తుండటంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ మాట్లాడుతూ మురికి కాలువ నీరు రోడ్డుపై ప్రవహిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని, మురికి కాలువను సందర్శించి పారిశుధ్య చర్యలు చేపడతామని తెలిపారు.

రోడ్డుపై నిలిచిన మురుగునీరు

గర్భిణులకు సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని తహశీల్దార్ సభా ప్రాంగణంలో గురువారం ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా ఒక సోదరుడిలా సీమంతాలు నిర్వహిస్తూ ఆడపడుచులకు అండగా నిలిచి భరోసా కల్పించడం ఆనందంగా ఉందన్నారు. స్త్రీ మాతృమూర్తిగా సంపూర్ణత్వాన్ని పొంది, దేశానికి భావిభారత పౌరులను అందించే మహిళలను పసుపు-కుంకుమలు, చీర, సారె పెట్టి గౌరవించుకోవడం తాను అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ మహిళా పక్షపాతిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సతీమణి పెద్ద విజయమ్మ, గంగిరెడ్డి సతీమణి మాళవిక రెడ్డి, వైసిపి యూత్ లీడర్ ముద్దా రామసుబ్బారెడ్డి, నరసింహకుమార్, ఎంపిడిఒ రఘురాం, ఇఒపిఆర్‌డి ప్రకాశం, స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, జడ్‌పిటిసి రామనాథం, అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఐసిడిఎస్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీమంతం నిర్వహిస్తున్న ఎంపిపి కుటుంబ సభ్యులు

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఆసియా బేగం

ప్రజాశక్తి-రామాపురం

జగనన్న ఆరోగ్య సురక్షను పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ హైదర్‌వలి పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందాడని అన్నారు. అనంతరం విలేజ్ హెల్త్ సెంటర్‌ను కొమ్మూరువాండ్లపల్లి సింగల్ విండో అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్ కుమార్, వినోద్‌కుమార్, చలమారెడ్డి గ్రామ సెక్రెటరీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మండలంలోని కొత్తఇండ్లు గ్రామ పంచాయతీ నందు సర్పంచ్ ఆసియ బేగం ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. డాక్టర్లు ప్రజల ఇంటి వద్దకే వచ్చి రోగులకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని అనారోగ్యాన్ని దూరం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ భానుప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ప్రజారోగ్యం కోసం ప్రజలకు విస్తృత అవగహన కల్పించి, విజయవంతంగా ఈ కార్యక్రమం అమలు చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండల మాజీ కో-ఆప్షన్ ఇస్మాయిల్, వైసిపి యువ నాయకులు ఇర్ఫాన్, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

రక్తహీనత రహిత జిల్లాగా మారుద్దాం : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికల్లో నివారించి జిల్లాను రక్తహీనత రహిత జిల్లాగా తయారు చేద్దామని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక డిఇఒ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బాలికలు సమాజ సమగ్ర వికాసానికి ప్రతీకలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు పథకాల్లో బాగంగా వారికోసం ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ సరఫరా చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు రక్తహీనత గల విద్యార్థినులకు ప్రతిరోజూ రెండు టాబ్లెట్స్ ఇవ్వాలన్నారు. సాధారణ స్థాయిలో హిమోగ్లోబిన్ స్థాయిగల ఆరోగ్య వంతమైన బాలికలకు ప్రతి గురువారం ఒక టాబ్లెట్ ఇవ్వాలన్నారు. ముఖ్యంగా 3 -5 తరగతుల బాలికలకు పింక్ కలర్,ఆ పైతరగతుల బాలికలకు బ్లూకలర్ టాబ్లెట్స్ ఇస్తారన్న విషయం గమనించాలన్నారు.విద్యాసంస్థలను సందర్శించిన సమయంలో పరిశీలిస్తే చాలాచోట్ల ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ వినియోగంపై అవగాహన లోపం కనిపించిందన్నారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ చాలా చోట్ల అందుబాటులో లేని విషయం గమనించానన్నారు. వెంటనే సంబంధిత ఉపాధ్యాయులు ,ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒలు నిర్దేశిత నమూనాలో నమోదు చేసి డిఇఒ కార్యాలయానికి అందిస్తే వెంటనే పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. టాబ్లెట్స్ విద్యార్థినులకు వేయించడం ఎంత ముఖ్యమో,దానిని యాప్ లో నమోదు చేయడం కూడా అంతే ముఖ్యం అన్నారు.యాప్ లో నమోదు చేయకపోతే సంబంధిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు విద్యాశాఖ సమీక్షల్లో ఇబ్బందికర పరిస్థితులు వస్తాయన్నారు. రక్త హీనత లేని సంపూర్ణ ఆరోగ్యవంతమైన బాలికల వికాసం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిలో అందరం భాగస్వాములం కావాలన్నారు. అక్షర క్రమంలో మాత్రమే కాదని,అన్ని కార్యక్రమాల్లో అన్నమయ్య జిల్లాను ముందువరుసలో నిలుపుదామని పిలుపునిచ్చారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులకు ఎస్ఐ రహీముల్లా బాలికోన్నత పాఠశాల కలికిరిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్త్రీలపై, బాలికలపై జరుగు లైంగిక దాడులను ఎదుర్కోవడముపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కలికిరి ప్రభుత్వ బాలికొన్నత పాటసాల, కలికిరి జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్, అక్షర స్కూల్లో స్త్రీలు, బాలికలపై జరుగు లైంగిక దాడులను ఎదుర్కోవడముపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించినారు. ఈ సందర్భముగా ఎస్ఐ రహీముల్లా , ఎఎస్ఐ మధుసూద నాచారి మాట్లాడుతూ బాలికలు అనుమానిత వ్యక్తులకు దూరముగా వుండ వలెనని, తమ పట్ల ఎవరైనా అసభ్యముగా ప్రవర్తిస్తే ప్రయత్నిస్తే వెంటనే తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు తెలుపాలని, వీలు కానీ పక్షములో డయిల్ 100 కు సమాచారమిస్తే వెంటనే పోలీసులు వచ్చి రక్షణ కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమములో పాటశాలల ప్రధాన ఉపాధ్యా యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, హెడ్ కానిస్టేబుల్లు రాజేంద్ర ప్రసాద్, రఫీ, కానిస్టేబుల్లు లక్ష్మినారాయణ, జిలానీ పాల్గొన్నారు.

రేపు వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని ప్రభుత్వం డైట్ స్కూల్ సమీపంలో బస్టాండ్ రోడ్డు వద్ద వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందని, వాల్మీకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా వాల్మీకి అధ్యక్షులు గువ్వల యోగానందబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిష్టకు కలెక్టర్ గిరీష, ఎస్పి కృష్ణారావు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి వస్తారన్నారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి

ప్రజాశక్తి-నందలూరు

ప్రజలు చట్టాల గురించి తెలుసుకోవాని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. గురువారం పాటూరు ఎస్‌టి కాలనీ లో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గ్రామస్తులకు దిశ యాప్, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్, ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనుమానస్పందంగా కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, స్థానిక పోలీసలుఉ పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్

స్థానిక నాయకులతో మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ మనోహర్

పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లి నియోజకవర్గం,బి.కొత్తకోట నగర పంచాయతీ పరిదిలోని దిగువ బస్టాండులో పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టి నట్లు కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. నగర పంచాయతీగా రూపాం తరం చెందిన తర్వాత రద్దీ పెరిగిందన్నారు. ప్రస్తుతం మరుగుదొడ్లు లేక ప్రజలు, మహిళలకు, ప్రయాణికులకు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పబ్లిక్ టాయిలెట్లు నిర్మించేందుకు ఎఇ రాజేందర్‌తో సర్వే చేయించి మరుగుదొడ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. పట్టణ ప్రజల శ్రేయస్సుకు తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రామాంజి, జాఫర్ బాషా, షేక్ ముజీర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేనేజర్ అమరావతి

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మహిళా సంఘ సభ్యులకు వైఎస్ఆర్ క్రాంతి పథకం ద్వారా ఇస్తున్న శ్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీనిధి మేనేజర్ అమరావతి కోరారు. గురువారం శ్రీ శక్తిభవన్ లో మహిళా సభ్యులతో శ్రీనిధి రుణాలపై అవగాహన కల్పించారు. సంఘంలోని మహిళా సభ్యులకు రూ.50వేల రూపాయలు నుంచి రూ.75 వేల వరకు శ్రీనిధి రుణాలు పొందవచ్చునన్నారు. మండలంలో రూ.4.43 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.3కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ రుణాలను సక్రమంగా వినియోగించుకొని ఆర్థికంగా ప్రతి మహిళ బలోపేతం కావాలని తెలిపారు. తీసుకున్న రుణాలు తిరిగి సకాలంలో చెల్లిస్తే భవిష్యత్తులో ఎక్కువ రుణం తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో సిసిలు భవాని శంకర్, బద్రి, ఆదిలక్ష్మి, తులసి, అషాద్ బేగం పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి బియ్యం, పండ్లు వితరణ

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల నాయకులు కటికరెడ్డి మధుసూదనరెడ్డి కుమారుడు యువ నాయకులు కటికరెడ్డి గుణవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మధు సూదనరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుమార్తెలు డాక్టర్ సంఘవీరెడ్డి, లిఖితారెడ్డి మండలంలోని కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న ఏసు కరుణాలయం అనాథా శ్రమంలో మానసిక విభిన్నప్రతిభావంతులకు పండ్లు, చెప్పులు, వంద కిలోల బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు. **వేంపల్లె :** వేంపల్లెలోని అనాథ వృద్ధాశ్రమాల్లో గురువారం అన్నదానం చేపట్టారు. ఎద్దులకొండ దేవస్థానం మాజీ చైర్మన్ కొండయ్య, నారాయణమ్మ కుమారుడు కొండ్రాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అన్నదానంతోపాటు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండయ్య కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-రామపురం

మండల కేంద్రమైన పాత రామాపురానికి చెందిన పగిడిండ్ల భాగ్యమ్మ(38) అనే మహిళ కడుపునొప్పి తాళలేక బుధవారం రాత్రి ఇంటి పైకప్పుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోలీసులు కథను మేరకు వివరాలు.. మండల కేంద్రమైన పాత రామాపురంకు చెందిన పగిడిండ్ల భాగ్యమ్మ గత మూడు సంవత్సరాల క్రితం అమెభర్త మృతి చెందాడని చెప్పారు. ఆమె కుమారుడు రెడ్డిశేఖర్ స్థానిక పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడని అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈమె అనారోగ్యంతో బాధపడుతూ కడపలో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్యం చేసుకుంటూ ఉండేదని అన్నారు. బుధవారం సాయంత్రం కడుపునొప్పి ఎక్కువ కావడంతో తన కుమారుని మందులు తీసుకొని రమ్మని పంపించి ఇంట్లోనే ఇంటి పై కప్పుకు చీరతో గొంతుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని రైతు మృతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ద్విచక్ర వాహనం ఢీకొని ఓ రైతు మృతి చెందిన సంఘటన పట్టణంలోని గొళ్లపల్లి మూడు రోడ్ల కూడలి వద్ద గురువారం చోటు చేసుకొంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. వాల్మీకిపురం పంచాయతీ ప్యారంపల్లికి చెందిన రైతు వెంకటరమణారెడ్డి(70) సొంత పనుల నిమిత్తం వాల్మీకిపురంకు బయలుదేరాడని అన్నారు. మార్గమధ్యంలోని గొళ్లపల్లి మూడు రోడ్ల కూడలివద్ద రోడ్డును దాటుతుండగా వెనుకవైపు నుంచి ఓ ద్విచక్రవాహనం ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రైతు వెంకటరమణారెడ్డి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేశ్వర రావు తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

గతంలో జరిగిన ఓ హత్యకేసులో తప్పించుకొని తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. పోలీసులుతెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లి యర్రమ్మ హత్యకేసులో రెండు సంవత్సరాలుగా కోర్టుకు హాజరు కాకుండా నిమ్మనపల్లి శ్రీనివాసులు తప్పించుకొని తిరుగుతున్నాడని తెలిపారు. చిత్తూరు సెషన్స్‌కోర్టు నిందితుడిపై నాన్‌బెయిలబుల్ వారెంటును జారీ చేసిందన్నారు. నింధితుడు పరారీలో ఉండడంతో ఎస్‌పి ఆదేశాల మేరకు స్పెషల్ టీంను ఏర్పాటు చేసి రంగంలోకి దింపామన్నారు. గురువారం నిందితుడు శ్రీనివాసులును అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరిచామన్నారు. స్పెషల్ టీంను ఎస్పీ అభినందించి కానిస్టేబుల్ సతీష్ కుమార్, అబ్దుల్లాకు రివార్డును ప్రకటించినట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఐ నాగేశ్వరరావు